రాత్రి పది వరకూ పోలింగ్



సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో రాత్రి 9 గంటల వరకు వేచి ఉన్న ఓటర్లు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో అనేక గ్రామాలు, పట్టణాల పరిధిలోని వార్డుల్లో ఈవీఎంలు సక్రమంగా పని చేయక పోవడంతో సోమవారం రాత్రి పది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగియాల్సి ఉండగా, అప్పటి వరకు క్యూలైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశమిచ్చారు. దాంతో ఆరు గంటల వరకు వచ్చిన ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లో ఉంచి గేట్లు మూసివేశారు. పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు పోలింగ్ శాతాన్ని ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి 9 వరకు 9.35 శాతం, 11.45 గంటలకు 23.44 శాతం, ఒంటి గంటకు 31.28 శాతం, మూడు గంటలకు 50.67 శాతం, ఐదు గంటలకు 64.10 శాతం పోలింగ్ అయినట్టు చెప్పారు. నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లుండగా, సాయంత్రం ఐదు వరకు 1,36,974 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అభ్యర్థుల భవిష్యత్తు భద్రం

స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన ఈవీఎంలు



సామర్లకోట బీబీఆర్ హైస్కూల్‌లో ఈవీఎంలకు సీల్ వేసిన పోలింగ్ అధికారులు

సామర్లకోట: నియోజకవర్గంలోని వివిధ కేంద్రాల్లో పోలింగ్ ముగియడంతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. బస్సుకు రెండు, మూడు వార్డులు కేటాయించడంతో, ఆయా వార్డులు, గ్రామాల్లో రాత్రి పది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. అప్పటి వరకు పోలింగ్ అధికారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ పూర్తయ్యాక కేంద్రాల్లో అభ్యర్థుల భవిష్యత్తును ఈవీఎంల్లో భద్రపర్చారు. వాటిని పీఓ, ఏపీఓలు ఆయా అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ వేశారు.

మేమూ తొలి ఓటు వేశాం..

చాలా ఆనందంగా ఉంది



పౌరురాలిగా తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉంది. రాజకీయాల కోసం పెద్దగా తెలియక పోయినా, సరైన వ్యక్తిని ఎన్నుకోవడం బాధ్యతగా ఫీల్ అవుతూ ఓటు వేశాను. తప్పనిసరిగా నేను ఓటు వేసిన అభ్యర్థి విజయం సాధిస్తారని భావిస్తున్నాను.

– చవ్వాకుల శ్రీలక్ష్మి, గుడివాడ, పెద్దాపురం మండలం

పెద్దవారితో కలిసి ఓటేశా



ఎప్పుడూ అమ్మానాన్న ఓటు వేయడానికి వెళ్తుంటే అలా చూస్తూ ఉండేవాణ్ణి. స్నేహితులతో కలిసి ఓటు కోసం మాట్లాడుకున్నప్పుడు ఎప్పుడు ఓటు హక్కు వస్తుందా అని ఎదురుచూశా. ఇప్పుడు పెద్దవాళ్లందరితో కలిసి ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా థ్రిల్‌గా ఉంది.

– రాయవరపు చైతన్య, తిరుపతి, పెద్దాపురం మండలం

సరైన నాయకుడి ఎన్నికతోనే..



ప్రజలందరికీ మేలు చేకూర్చే నాయకుడిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని భావిస్తున్నాను. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా గొప్పగా ఫీల్ అవుతున్నాను. నేను పౌరురాలిగా, సమర్థ నాయకుడుకే ఓటు వేశాను. నేను వేసిన నాయకుడు గెలుస్తారనే ఫీల్ అవుతున్నాను.

– మాసా యామిని, తిరుపతి, పెద్దాపురం మండలం

అమ్మతో కలిసి ఓటేశా



తొలిసారి అమ్మతో కలిసి ఓటేశా. ఏదో తెలియని కొత్తదనం. నేను ఓ బాధ్యత గల పౌరురాలినన్న ఫీలింగ్ చాలా సంతోషంగా అనిపించింది. సమాజంలో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే విధంగా గర్విస్తూ ఓటు హక్కును వినియోగించుకున్నా.

– శానపల్లి గంగాశ్రీ, కాండ్రకోట, పెద్దాపురం మండలం.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నిత్య హోమాలు, అర్చన, లక్ష్మీ హోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు జరిపారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు.



మాధవపట్నంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు



పనసపాడులో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ లతాకుమారి



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న రొట్టె సరళ



వీకే రాయపురంలో ఓటు వేసేందుకు దివ్యాంగుడిని తీసుకువస్తున్న బంధువులు

పోలింగ్ ప్రశాంతం

- ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు
- అనేక చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ సరళిని పరిశీలించిన దొరబాబు
- కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పెద్దాపురం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గ పరిధిలో రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలకు చెందిన 41 గ్రామాల్లో 201 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆయా ప్రాంతాల వద్ద టీడీపీ, వైఎస్సార్ సీపీలకు చెందిన నాయకులు చేరుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకుని, గుంపులను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. అనేక గ్రామాల్లో పోలింగ్ సమయం ఆరు దాటిన తర్వాత కూడా మాధవపట్నం, వీకే రాయపురం, తిరుపతి, సామర్లకోట తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు క్యూలైన్లలో నిలబడ్డారు. ఎన్టీఆర్ ఎలిమెంటరీ పాఠశాలలోని 160వ పోలింగ్ బూత్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోని 158వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం సుమారు గంట సేపు మొరాయించింది. బ్రౌన్‌పేట 132వ పోలింగ్ స్టేషన్, పెద్దాపురం మండలం కట్టమూరులోని 191వ పోలింగ్ బూత్‌లోని ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లోని 138, 139, 141, 149 పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు తరచూ ఆగిపోవడంతో ఓటర్లు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. పెద్దాపురం మండలం తాటిపర్తిలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన కుటుంబ సభ్యులతో అచ్చంపేట గ్రామంలోని 195వ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్త ఓటర్ల ఓటు హక్కు వినియోగం

పట్టణానికి చెందిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు పొందిన వారు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పాలకులను ఎన్నుకునే అవకాశం తమకు తొలిసారి రావడం ఎంతో ఆనందంగా ఉందని స్థానిక 12వ వార్డుకు చెందిన రొట్టె సరళ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఉమ్మడి మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొరలు స్థానిక సత్యనారాయణపురంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. వృద్ధులకు ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో అనేక మంది బటన్ నొక్కినా శబ్దం రాక అయోమయానికి గురయ్యారు. దాంతో ఆయా పోలింగ్ బూత్‌ల్లో జాప్యం జరిగింది. పవర గ్రామంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి అంబులెన్స్‌లో ఓటు వేయడానికి తీసుకువచ్చారు.



వీకే రాయపురంలో ఉదయమే బారులు తీసిన ఓటర్లు

భారీ పోలీసు బందోబస్తు

నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు, సాధారణ పోలింగ్ కేంద్రాల్లోను పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించారు. పనసపాడు గ్రామంలో పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు మొహరించారని స్వతంత్ర అభ్యర్థి రాయుడు మోజెస్ డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో, ఆమె హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అయితే అలాంటి పరిస్థితులు లేకపోవడంతో, భద్రతా సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పెద్దాపురం: మండలంలోని పులిమేరులో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల దొరబాబు, తాటిపర్తిలో స్వతంత్ర అభ్యర్థి దువ్వాడ కన్నబాబు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




తాటిపర్తిలో ఓటు వేసిన వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు



సామర్లకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ



ఓటు హక్కు వినియోగించుకున్న కమిషనర్ రామారావు



సామర్లకోటలో ఓటు వేసిన ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర



కొండెవరంలో ఎండలో క్యూలో ఉన్న ఓటర్లు



కోనపాపపేట దివ్యాంగ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు



నాగులాపల్లిలో వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకువస్తున్న దృశ్యం



నాగులాపల్లిలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు

పోటెత్తిన ఓటర్లు

- అన్ని చోట్లా భారీగా పోలింగ్
- ఉదయం నుంచీ ఓటు వేసేందుకు బారులు
- చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతం



కుతుకుడుమిల్లిలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని ఎత్తుకువస్తున్న దృశ్యం

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పిఠాపురం నియోజకవర్గంలో సోమవారం చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రారంభం నుంచి అన్ని చోట్లా పోలింగ్ వేగంగా కొనసాగడంతో, మధ్యాహ్నానికి 50 శాతం ఓటింగు దాటింది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం7 నుంచి 9 గంటలకు 10.05 శాతం పోలింగ్ నమోదైంది. అంతే వేగంగా పోలింగ్ కొనసాగడంతో ఉదయం 11 గంటలకే 22.56 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 44.23 శాతం, 3 గంటలకు 56.34 శాతం, 5 గంటలకు 72.23 శాతం, సాయంత్రం 6 గంటలకు శాతం ఓటింగు నమోదైంది. ప్రతి గ్రామంలోను ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపడంతో పాటు, అభ్యర్థులు ఓటర్లను వాహనాలపై పోలింగ్ కేంద్రాలకు తరలించడం కనిపించింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల అభిమానుల హడావిడి ఎక్కువగా ఉండడంతో, పోలీసులు వారిని చెదరగొట్టేందుకు శ్రమించాల్సి వచ్చింది. పిఠాపురం మండలం విరవాడలో వైఎస్సార్ సీపీ నాయకులపై జనసేన నాయకులు దాడికి దిగడంతో, ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, ఘర్షణకు దారి తీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో, పరిస్థితి సద్దుమణిగింది. విరవలో తమ ఓట్లు తమకు తెలియకుండా తొలగించారంటూ పలువురు ఓటర్లు ఆందోళనకు దిగారు. అధికారులు వారికి వివరించి పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించేశారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పలు పోలింగ్ కేంద్రాల్లో వందలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరి ఉన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత దంపతులు, ఎమ్మెల్యే పెండెం దొరబాబు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, పిఠాపురం మండలం పి దొంతమూరులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ దంపతులు ఓట్లు వేశారు.

ఆలస్యంగా ముగిసిన ఓటింగ్

కొత్తపల్లి: కాకినాడ పార్లమెంటు, పిఠాపురం నియోజకవర్గాలకు ఎన్నికల పోలింగ్ సోమవారం ఆలస్యంగా ముగిసింది. మండలంలో మొత్తం 66,551 మంది ఓటర్లకు 70 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, ఓటర్ల కోసం ర్యాంపులు, బెంచీలు, మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయాలను ఏర్పాటు చేశారు. దేశ, దేశ విదేశాల్లో ఉన్న వారు కూడా ఇక్కడకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పొన్నాడ శివారు కోనపాపపేటలో దివ్యాంగుల కోసం అధికారులు ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పోలింగ్ కేంద్రంలో ఉప్పెన సినిమా దర్శకుడు సానా బుచ్చిబాబు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముందుకొచ్చిన యువత, వృద్ధులు

ఎన్నికల్లో ఓటు వేసేందుకు వృద్ధులు, కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు ఆసక్తి కనబర్చారు. మండుటెండలో సైతం క్యూ కట్టి, వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమస్యాత్మక గ్రామాలైన ఉప్పాడ, అమీనాబాద్, కొత్త మూలపేట, రమణక్కపేట, శ్రీరాంపురం, నాగులాపల్లి గ్రామాలపై పోలీసులు ప్రత్యే దృష్టి పెట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. కేంద్రాలను ఉన్నత స్థాయి ఎన్నికల అధికారులు పరిశీలించారు.



పిఠాపురం మండలం మల్లాంలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఉప్పాడలో తల్లిని వీల్‌చైర్‌పై తెస్తున్న కొడుకు



కొత్తపల్లిలో ఓటు వేసిన సినీ దర్శకుడు బుచ్చిబాబు

ఎన్నికల సిత్రాలు







పిఠాపురం మండలం విరవాడలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు





పిఠాపురం మండలం విరవలో కొత్త ఓటర్లు



విరవలో తల్లి ఓటు వేసేందుకు వెళ్లడంతో పిల్లలతో ఉన్న తండ్రి



పిఠాపురం మండలం చిత్రాడలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



పిఠాపురం మండలం విరవాడలో ఓటు వేసేందుకు నిలబడిన ఓటర్లు



పోలింగ్ కేంద్రం వద్ద పిల్లలు